# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రజాస్వామ్య పరిరక్షణలో పార్లమెంట్ సభ్యులందరూ విజయవంతమవ్వాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆకాక్షించారు.
- డయేరియా కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని మరో 6 నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.
- నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సాహిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.
- పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచకప్ రెండవ సెమీఫైనల్ లో భాగంగా భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య ఈరోజు రాత్రి 8 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది.

===========================

ప్రజాస్వామ్య పరిరక్షణలో పార్లమెంట్ సభ్యులందరూ విజయవంతమవ్వాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆకాక్షించారు. నూతనంగా ఏర్పడిన 18వ లోక్‌సభతో పాటు రాజ్యసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ఈరోజు పార్లమెంట్ లో ప్రసంగిస్తూ... లోక్‌సభకు ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలు సజావుగా జరిగాయని ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల సంఘానికి అభినందనలు తెలియజేశారు. సంస్కరణలు, పనితీరు, మార్పు ఆధారంగా ప్రజలు ఎన్నికల్లో తీర్పు ఇచ్చారని.. త్వరలోనే భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందన్నారు. దేశ ప్రజల విశ్వాసం గెలిచి సభకు వచ్చిన సభ్యులందరూ వారి ఆకాంక్షలను నెరవేర్చేలా కృషి చేయాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

===========================

డయేరియా కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ... తాగునీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకోవాలని, తాగు నీటి సౌకర్యం లేని గ్రామాలపై దృష్టి సారించాలన్నారు. "జల్ జీవన్ మిషన్" పథకం నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. జల్ జీవన్ మిషన్‌లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, నిధులకు సంబంధించిన వివరాలను అందించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

==========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. రాష్ట్ర ప్రభుత్వం నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని పొడిగించాలని రాసిన లేఖను పరిగణించిన కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు... అనగా జులై 1వ తేదీ నుండి డిశంబరు 31 వరకూ పొడిగిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఓపిటి) ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయాల్సి ఉండగా, పదవీ కాలం పొడిగింపు ఉత్తర్వులతో మరో ఆరు నెలల పాటు నీరబ్ కుమార్ ప్రసాద్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగనున్నారు.

==========================

నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సాహిస్తామని  సూక్ష్మ, మధ్య, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల దినోత్సవం (ఎంఎస్ఎంఈ) సందర్భంగా ఈరోజు విజయవాడలో ఆంధ్రప్రదేశ్ చిన్న, మధ్య తరహా పరిశ్రమల సంఘాల సమాఖ్య (ఫ్యాప్సియా) ఆధ్వర్యంలో జరిగిన ఎంఎస్ఎంఈ ప్రతినిధుల సమావేశంలో మంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. మహిళా పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేస్తామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

విశాఖ జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో జూన్ 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరగనుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని న్యాయ స్థానాల్లోని పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలకు సంబంధించిన కేసులు, కుటుంబ తాగాదాలు, కార్మిక, పారిశ్రామిక వివాద కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు లోక్ అదాలత్ లో పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజమార్గమనే నినాదంతో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎం.వి.శేషమ్మ సూచించారు.

==========================

పురుషుల టీ-20 క్రికెట్ ప్రపంచకప్ 2024 ఆఖరి దశకు చేరుకుంది. ఈరోజు జరిగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్ లో ఆఫ్ఘనిస్తాన్ పై దక్షిణాఫ్రికా జట్టు 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంతో టోర్నమెంట్ ఫైనల్స్‌కు చేరుకుంది.  అలాగే రెండో సెమీఫైనల్ లో భాగంగా భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య మ్యాచ్ గయానా వేదికగా ఈరోజు రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్ లో గెలిచిన జట్టు 2024 టీ-20 ఛాంపియన్ గా నిలిచేందుకు దక్షిణాఫ్రికాతో పోటీ పడనుంది.

విరామం

==========================

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈరోజు విజయవాడ కానూరులో ఏర్పాటు చేసిన రామోజీరావు సంస్మరణ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రులు, సినీ ప్రముఖులు హాజరై పుష్పాంజలి ఘటించారు. పత్రికా రంగంతో పాటు వివిధ రంగాల్లో రామోజీరావు అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఆయన సంస్మరణ సభను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది.

==========================

గంజాయి నిర్మూలన, మహిళ రక్షణ, పోలీసు సంక్షేమం, పోలీసు శాఖలో నియామకాల భర్తీ అనే నాలుగు అంశాలు అజెండాగా ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. డీజీపీ, ఇతర ఉన్నతాధికారులతో అమరావతిలో ఈరోజు సమావేశం నిర్వహించిన అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ప్రభుత్వం పోలీసు వ్యవస్థను విస్మరించిందని, కేంద్రం నుంచి నిధులొచ్చినా పోలీసు అకాడమీ నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని 100 రోజుల ప్రణాళిక ఏ విధంగా అమలు చేయాలనే దానిపై చర్చిస్తామన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయిని అరికట్టేందుకు వీలుంటుందని, మంచి ఆలోచనతో పనిచేస్తే విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బాధలు చెప్పుకొనేలా భరోసా ఇవ్వాలని పోలీసులకు మంత్రి సూచించారు.

==========================

వాయువ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే రెండు రోజులు తేలికపాటినుంచి ఒక మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

==========================

విశాఖపట్నం - సికింద్రాబాద్, విశాఖపట్నం - తిరుపతి మధ్య నడిచే ప్రత్యేక రైళ్లను పొడిగిస్తూ తూర్పుకోస్తా రైల్వే నిర్ణయింతీసుకుందని వాల్తేరు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్ కే.సందీప్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జూలై 3వ తేదీ నుంచి ప్రతి బుధవారం విశాఖపట్నం - సికింద్రాబాద్ ఎక్స్ ప్రెస్ విశాఖ నుంచి రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటల 20 నిమిషాలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి గురువారం రాత్రి సికింద్రాబాద్ లో 7 గంటల 40 నిమిషాలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం విశాఖకు 6 గంటల 40 నిమిషాలకు చేరుకుంటుంది. ఈ సర్వీసులు ఆగస్టు 7వ తేదీ వరకు కొనసాగుతాయి. అలాగే విశాఖపట్నం - తిరుపతి ప్రత్యేక రైలు జూలై ఒకటో తేదీ నుంచి ప్రతి సోమవారం విశాఖ నుంచి రాత్రి 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9 గంటల 15 నిమిషాలకు తిరుపతి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి మంగళవారం తిరుపతిలో రాత్రి 9 గంటల 55 నిమిషాలకు నిమిషాలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10 గంటల 15 నిమిషాలకు విశాఖ చేరుకుంటుందని, ఈ సర్వీసులు ఆగస్టు 28 వరకూ కొనసాగుతాయని ప్రకటనలో తెలిపారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ - మనసులో మాట” కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి “మన్ కీ బాత్” కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల

28వ తేదీ లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ ద్వారా లేదా, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

============================
============================